# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 236 శనివారం | 23 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




8లో

## సింహ వాహనంపై ఊరేగిన నారసింహుడు

వైభవంగా కొనసాగుతున్న కోటంచ బ్రహ్మోత్సవాలు

వివరాలు 2లో..



# కేసీఆర్ చుట్టూ.. సమస్యల ముళ్లు

- మానసిక క్షోభ అనుభవిస్తున్న మహా నేత
- ఒక్కొక్కరు పార్టీ వీడుతున్న వైనం
- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న లిక్కర్ కేసు
- సైలెంట్ మోడ్‌లో కేసీఆర్, కేటీఆర్

కేసీఆర్ చుట్టూ సమస్యల ముళ్లు గూడుకట్టుకుంటున్నాయి. 14 సంవత్సరాలు ఉద్యమ నేతగా, 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఒక వెలుగు వెలిగిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రస్తుతం కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. తనకు ఎదురు లేదు.. తన పాలనకు తిరుగులేదన్న గుడ్డి నమ్మకంతో ఇష్టానుసారంగా వ్యవహరించిన కేసీఆర్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరాజయం ఎదురైంది. దీంతో సమస్యలు ఒక్కొక్కటిగా కేసీఆర్ తలుపు తట్టడం మొదలైంది. వయసుతోపాటు వస్తున్న అనారోగ్య సమస్యలు కేసీఆర్‌ను కలవరపాటుకు గురిచేస్తుంటే కూతురు కవిత లిక్కర్ కేసు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. త్వరలోనే కాంగ్రెస్ ఖాళీ అవుతుంది.. మనదే అధికారం అంటూ గొప్పగా ప్రకటించిన కొద్ది రోజులకే పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు కారు దిగడం ప్రారంభించడంతో మానసిక క్షోభకు గురవుతున్నారు. దీంతో అనుకున్నది ఒక్కటి.. ఐనదొక్కటి అంటూ కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీష్ రావు తలలు పట్టుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



పాఠకులకు, ప్రకటనకర్తలకు, జర్నలిస్టు మిత్రులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, వ్యాపార వాణిజ్యవేత్తలకు,

**హోళి మహోత్సవ శుభాకాంక్షలు..**

హోళి సందర్భంగా సోమవారం కార్యాలయానికి సెలవు .. పున: దర్శనం మంగళవారం..



8లో

## ఏఐసీసీ ముఖ్యులను కలిసిన పెరుమాండ్ల



2లో

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు

# కేసీఆర్ చుట్టూ.. సమస్యల ముళ్లు



మానసిక క్షోభ అనుభవిస్తున్న మహా నేత

ఒక్కొక్కరు పార్టీ వీడుతున్న వైనం

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న లిక్కర్ కేసు

సైలెంట్ మోడ్‌లో కేసీఆర్, కేటీఆర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉద్యమ సమయంలోనూ, ముఖ్యమంత్రిగానూ మొత్తం 24 సంవత్సరాల పాటు పులిలా గాండ్రించిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధికారం పోవడంతోనే పిల్లిలా మారారన్న ప్రచారం సాగుతోంది. కొడుకు కేటీఆర్ అహంకారం, కూతురు కవిత లిక్కర్ స్కాం ఆయనకు మచ్చ తెచ్చిపెట్టాయి. దీనికితోడు వయసుతోపాటు వస్తున్న అనారోగ్య సమస్యలు కేసీఆర్ ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఉద్యమ సమయంలో జై తెలంగాణ అంటే లక్షల పిడికిళ్లు ఆయనకు బాసటగా నిలిచేవి. నేడు ఆ వేడి, వాడి కనిపించడంలేదు. బహిరంగ సభల్లో ఆయన ప్రసంగం కూడా ప్రజలను ఆకట్టుకోలేకపోతోంది. దీంతో పులి బయటికి వస్తోందంటూ కేసీఆర్ ను ఉద్దేశించి కేటీఆర్ ముందే హింట్ ఇచ్చినా పెద్దగా స్పందన కరువైంది.

## పార్టీ వీడుతున్న నేతలు..

ఉచితాలకు ఆశపడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారంటూ కేసీఆర్, కేటీఆర్ చేస్తున్న ప్రచారం బీఆర్ ఎస్ పార్టీ కొంప ముంచుతోంది. త్వరలోనే కాంగ్రెస్ ఖాళీ అవుతుందని, మనదే అధికారం అంటూ గొప్పగా చెప్పుకున్నారు. అయితే కేసీఆర్, కేటీఆర్ లు చేస్తున్న ప్రచారాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం కేసీఆర్ ప్రకటించిన వివిధ పథకాలకు ఆశపడే ఉద్యమ పార్టీని అందలం ఎక్కించామా అన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను చులకన చేస్తూ మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్ తగిన గుణపాఠం తప్పదంటున్నారు. అయితే బీఆర్ ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ ను వీడటం కేసీఆర్‌ను కలవరపెడుతోంది. కాంగ్రెస్ పార్టీలోకి కొందరు, బీజేపీలో మరికొందరు చేరుతుండటంతో బీఆర్ఎస్ పార్టీని కాపాడుకునే ప్రయత్నంలో కేసీఆర్ సతమతం అవుతున్నారు.

## పోయేటోళ్లు పోనీ..

అధికారం దూరమైతే ఇలాంటి పరిణామాలు ఉంటాయని కేసీఆర్ కు ముందే తెలుసు. అయితే పోయేటోళ్ళు పోనీ, ఉండేటోళ్ళు ఉండని అనేవిధంగా కేసీఆర్ ఉన్నారా? అన్న ప్రశ్న పార్టీలో వినిపిస్తోంది. ఆయన సైలెంట్ మోడ్ లోకి పోవడానికి పవర్ పాలిటిక్సే కారణమా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కేసీఆర్ గురించి తెలిసిన వారు మాత్రం ప్రస్తుతం పార్టీ గురించే కేసీఆర్ ఆలోచిస్తు న్నారంటూ ప్రచారం చేస్తున్నారు. నిజానికి పవర్ పాలిటిక్స్ కూడా ఇలాగే ఉంటాయి. పవర్ ఎటుంటే అటు విపక్షాల ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళ్లిపోవడం ఇటీవలి రాజకీయాల్లో సర్వసాధారణంగా మారాయి.

## ఓటమిపై విశ్లేషణ కరువు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించుకోవడంతో బీఆర్ ఎస్ వెనుకబడిందనే చెప్పవచ్చు. అధికారం కోల్పోయి వంద రోజులకు పైగా కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేలా మాట్లాడుతున్నారు తప్ప ప్రజల సింపథిని సంపాదించి ఎలా తిరిగి అధికారంలోకి రావాలన్న ఆలోచనే కేసీఆర్, కేటీఆర్ లలో కనిపించడంలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి కంటే కేసీఆర్ గొప్ప అంటూ హెచ్చులకు పోతున్నారు. జరిగిన తప్పులను సరిచేసుకోవడంలేదు. అదేవిధంగా ప్రజాభిమానాన్ని పొందేందుకు ప్రయత్నం చేయడం లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ ఎస్ జెండాతో విజయం సాధించిన 39 ఎమ్మెల్యేలను ఐదేళ్లపాటు కాపాడుకోవడం ఆ పార్టీకి కష్టమే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పుడు అధికార పక్షంపై గొంతు చించుకునేవారే ముందు పార్టీ ఫిరాయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది.

## కేసీఆర్‌కు చరమగీతం

2014లో టీడీపీ, కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి చేర్చుకుని అధికారం సాధించారు. 2018లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారు. రాష్ట్రంలో వరుసగా రెండోసారి 2018లోనూ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 2019లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎక్కువమందిని చేర్చుకుని, కాంగ్రెస్పార్టీకి విపక్ష హెూదా లేకుండా చేశారు. తన పార్టీ తప్ప వేరే పార్టీ ఉండొద్దు. ప్రశ్నించే విపక్షం ఉండొద్దు అనేవి ధంగా కేసీఆర్ వ్యవహరించారు. మొత్తం ఆధిపత్య మే, అసెంబ్లీలోను అదే ధోరణి ఉండేది. ప్రజలను కలిసేది లేదు. అర్జీలు తీసుకునేది లేదు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఆయనను కలవడానికి పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. మొత్తం తెలంగాణకే ఆయన పాలన ఆత్మగౌరవ సమస్యగా, పెను సవాల్ అయిపోయింది. నెత్తికెక్కించుకున్నవారే 2023 ఎన్నికల్లో నేలకేసి కొట్టారు. కేసీఆర్ సర్కారుకు చరమగీతం పాడి కూల్చేశారు. కాంగ్రెస్ పార్టీకి పాలక పగ్గాలు ఇచ్చారు.

## బీఆర్ఎస్ ఖాళీ..

కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తన పార్టీలో కలిపేసుకున్నారో.. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా అదే బాట పట్టారు. వంద రోజుల కాంగ్రెస్ పాలన పూర్తి అవగానే ప్రజాస్పందన చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుడు మొదలు పెట్టారు. ఇప్పటికే పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు క్యూ కట్టారు. కేసీఆర్ ఏ పని అయితే చేశారో అదే పని ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఉన్న 39 మంది ఎమ్మెల్యేల్లో 20 మంది దాకా ఇప్పటికే కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధం అయినట్లు సమాచారం.

## కేసీఆర్ పరేషాన్..

అయితే మొత్తానికి బీఆర్ఎస్ తెలంగాణలో ఖాళీ అయిపోతుందా? అనే అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం కేసీఆర్ పార్టీని పట్టించుకునే పరిస్థితులో లేరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూతురు కవిత అరెస్ట్ ను కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమెను బయటికి తీసుకొచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నట్లు సమాచారం. అయితే తెలంగాణలో బీఆర్ ఎస్ నామరూపాలు లేకుండా చేసేందుకు రెండు జాతీయ పార్టీలు పావులు కదుపుతన్నట్లు ప్రచారం సాగుతోంది. నిజానికి తెలంగాణ ఉద్యమ సమయంలో, సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ హడావిడి, హంగామా చాలా డిఫరెంట్ గా ఉండేది. ఇప్పుడు అదేమీ కనిపించడం లేదు. అధికారం కోల్పోయిన తరువాత కొద్దిరోజులకే ఆయన సిక్ కావడంతో పాటు ఓటమిపై మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఎంతో ఆర్భాటంగా కట్టి ప్రారంభించిన జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. మొత్తానికి కేసీఆర్, ఆయన పార్టీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇటు సీఎం రేవంత్ రెడ్డి స్పీడుకు, అటు బీజేపీ దూకుడుకు తట్టుకొని నిలబడుతుందా వేచి చూడాల్సిందే.

# పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేట దర్గాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సోమిడిలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్యపై వాకబు చేవారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ బావ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్‌లో..

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా మౌలిక వసతులు సరిగా ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలోని కాశిబుగ్గ నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎల్బీ నగర్ లోని లేర్నర్స్ ల్యాండ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాస్ కాపీలు జరగకుండా బాధ్యతగా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్ ను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు అనుమతించరాదని, పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండరాదని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పించిన తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలు, మెడికల్ క్యాంప్ లను పరిశీలించి, నిరంతరం విద్యుత్ ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ మహ్మద్ ఇక్బాల్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

### మైనర్ బాలిక లైంగిక దాడి ఘటనపై సీరియస్



**వరంగల్ వాయిస్, క్రైం :** మైనర్ బాలిక పై లైంగిక దాడికి యత్నించి ఫోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్స్ స్పెక్టర్ బండారి సంపత్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లాలో సైబర్ క్రైం ఇన్స్ స్పెక్టర్ గా పనిచేస్తున్న బండారి సంపత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయూసి పోలీస్ స్టేషన్ ఎస్ ఐగా విధులు నిర్వహించే సమయంలో ఒక మహిళతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. సదరు మహిళ కేయూసి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో నివాసం ఉంటోంది. ఇన్స్ స్పెక్టర్ సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు రావడంతో భర్తతో దూరమైన మహిళతో ఇన్స్ స్పెక్టర్ సంపత్ కుమార్ సహజీవనం చేయసాగాడు. దీంతో సదరు మహిళా భర్త గతంలో వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ కు ఫిర్యాదు చేయగా సంపత్ కుమార్ సీపీ రంగనాథ్ వీఆర్ అటాచ్ చేశారు. కొద్ది రోజుల తర్వాత సంపత్ కుమార్ ఇన్స్ స్పెక్టర్ గా పదోన్నతి పై భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంకు నియమించబడ్డాడు. ఇదే క్రమంలో మహిళ వద్దకు వస్తూ పోతున్న క్రమంలో సంపత్ దృష్టి మహిళ కుమార్తె పై పడింది. ఇటీవల కాలంలో ఇన్స్ స్పెక్టర్ సంపత్ కుమార్ అ బాలికపై అత్యాచారానికి యత్నించాడు. ఈ సంఘటనతో సదరు మహిళ కేయూసీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం ఇన్స్ స్పెక్టర్ సంపత్ కుమార్ ను ఫోక్సో కేసు క్రింద అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. భద్రత కల్పించాల్సిన పోలీస్ అధికారి బాలిక పై అత్యాచారానికి యత్నించినందుకు ఇన్స్ స్పెక్టర్ సంపత్ పై శాఖపరమైన చర్యలు తీసుకునే చర్యల్లో భాగంగా భూపాల్ పల్లి సైబర్ క్రైమ్ ఇన్స్ స్పెక్టర్ సంపత్ కుమార్ ను సస్పెండ్ చేస్తున్నట్లుగా మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాథ్ వెల్లడించారు.

# తాగునీటి వనరుల ఆకస్మిక తనిఖీ

## అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఫిల్టర్ బెడ్స్, మిషన్ భగీరథ (గ్రిడ్) తాగునీరు అందించే వనరులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహబూబాబాద్ పట్టణం, జిల్లాలోని మరిపెడ, మిషన్ భగీరథ- గ్రిడ్, పాలేరు, వరంగల్ సెగ్మెంట్ మహబూబాబాద్ జిల్లా త్రాగునీరు అందించే ప్రాజెక్టులను, నీటి శుద్ధిప్రక్రియ, పంపు హౌస్, ల్యాబ్, సందర్శించి సంబంధిత ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మున్సిపల్ పరిధి, గ్రామాలలో తాగునీరు సమస్య లేకుండా పక్కా ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మహబూబాబాద్ పట్టణ, జిల్లా ప్రధాన వాటర్ సోర్స్, ఏటిగడ్డ ఫిల్టర్ బెడ్, (మున్నేరు వాగు), మిషన్ భగీరథ, పాలేరు వరంగల్ సెగ్మెంట్ (గ్రిడ్) ద్వారా జిల్లాలో సుమారు (1701) గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అవుతుందన్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లాలో ఇప్పటికే పలు దఫాల్లో తాగునీరుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి అధికారులకు తగు ఆదేశాలు, సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, (హాస్టల్లు), మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్, తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని వార్డులకు, జిల్లాలోని (461)గ్రామపంచాయతీ పరిధిలలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుంటూ, గ్రామాల్లో మరమ్మతులలో ఉన్న చేతి పంపులు, బోర్లు , మంచినీటి బావులు, తదితర వాటర్ సప్లై వనరులను వాడకంలోకి తేవడానికి క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.సురేందర్, డీఈ స్వామి దాస్, ఎంపీడీవో రేవతి, ఏఈ నిశాంత్, తదితరులు ఉన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, ములుగు :** మండలంలోని కొత్తూరు గ్రామ శివారులోని దేవుని గుట్టపై గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సూర్య, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాదం ప్రవీణ్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నేపాల్ రావు, ములుగు మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, దేవస్థానం కమిటీ సభ్యులు వెంకటస్వామి, అక్కల పోశయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు.

## రేపు బహుభాషా కవి సమ్మేళనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 24న ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు హనుమకొండ కలెక్టరేట్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు మహమ్మద్ సిరాజుద్దీన్, ప్రొఫెసర్ సురేష్ లాల్ తెలిపారు. హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా మాజీ గ్రంథాలయ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, అంపశయ్య నవీన్, అన్నమనేని జగన్మోహన్ రావు ఆత్మీయ అతిథులుగా కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను సంస్థ సభ్యులు నిమ్మల శ్రీనివాస్ , శనిగరపు రాజమోహన్ లతో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్నట్లు సిరాజుద్దీన్ తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ కస్తూరి సాయిలు, మాతృమూర్తి కస్తూరి అనసూర్య(89) నెల్లికుదురు పట్టణ కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్ననెల్లికుదురు మాజీ సర్పంచ్ కస్తూరి శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర పొలిట్ భ్యూరో చైర్మన్ అశోద భాస్కర్ తో కలిసి సీనియర్ జర్నలిస్ట్ నీను(బొడ్డు అశోక్) అమ్మ మృతి దేహాన్నిసందర్శించి నివాళులర్పించి ఓదార్చారు. అమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని అన్నారు..

## వార్డులో సమస్యలకు పరిష్కారం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఒకటో వార్డులో సానిటేషన్ పనులను శనివారం కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ చేయించారు. వార్డులో డ్రైనేజీ శుభ్రం చేయించుట, ఇంటింటికి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరించుట, ఇంటింటికి నల్లాల ద్వారా నీళ్లు అందించుట, స్ట్రీట్ లైట్ వార్డులో వెలిగేలా చూడటం వార్డులో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రతిరోజు ఉదయాన్నే వార్డులో తిరుగుతూ వార్డులో నెలకొని ఉన్న సమస్యల గురించి తెలుసుకోని త్వరితగతిన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధి కోసం కౌన్సిల్ సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.

## పెద్దపెల్లి ఎంపీగా గడ్డం వంశీని గెలిపించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెద్దపెల్లి ఎంపిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని మన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుట్టి రంజిత్ కుమార్ కోరారు. శనివారం హనుమకొండలో మన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుట్టి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న కాకా (వెంకటస్వామి) కుటుంబ సేవలను గుర్తించి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకి టికెట్ కేటాయించిన సోనియా గాంధీకి కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతిక్షణం పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడే గడ్డం కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పెద్ద పల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏవైఎస్ గౌరవ సలహాదారులు కామాద్రి కనకయ్య, గౌరవాధ్యక్షుడు కుంచం సాయిలు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, నాయకులు సునీల్, రషీద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పోషణ్ అభియాన్



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గం నడికూడ మండలం నర్సక్కపల్లె అంబేద్కర్ కాలనీలోని 2వ అంగన్వాడీ సెంటర్ లో పోషణ్ అభియాన్ లో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కోడెపాక సుప్రియ పాల్గొని మాట్లాడుతూ గర్భవతులకు సీమంతాలు, ఆరు నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేయడం జరిగింది. గర్భవతులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనతకు ఎలాంటి పోషకాహారమైన కూరగాయలు, ఆకుకూరలు, క్యారెట్, బీట్రూట్, పాలు, కోడిగుడ్లు తీసుకోవాలని వివరించారు. చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, రాగులు, జొన్నలు వంటి వాటిలో లభించే పోషకాల గురించి వివరించారు.పెరటి తోటలపెంపకం గురించి వివరించారు. పోషణ్ పక్వాడ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుప్రియ, ఆయా జన్ను వనజ, ఆశా వర్కర్ కొడపాక కోమల, బాలింతలు, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ స్కూల్ లో షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్ ల 93 వర్ధంతి ఏఐఎఫ్ డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య )ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఏఐఎఫ్ డీఎస్, వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ వాదులపైన తిరుగుబాటు చేసిన వ్యక్తి భగత్ సింగ్ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారు భారతీయులపై చేస్తున్న అన్యాయాలపై పోరాటం చేశారు. ఢిల్లీ నడిబొడ్డులో ఎర్రని కాగితాలు చల్లుతూ ప్రజలను చైతన్యం చేశారు. లాలా లజపతిరాయ్ మరణాంతరం పంజాబ్ విభజన జలియన్ వాలాబాగ్ అన్యాయాలను చూసి చలించి బ్రిటిష్ సామ్రాజ్యంపై పోరాటం కొనసాగించారు. పార్లమెంటులో పొగ బాంబులను విసిరారు. దానిక బ్రిటిష్ సామ్రాజ్యం భగత్ సింగ్ పై నేరారోపణలు చేసి ఉరి తీయడం చాలా బాధాకరమన్నారు. అతి చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప విప్లవకారుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఇంతటి చరిత్రను కలిగిన భగత్ సింగ్ వర్ధంతి, జయంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే భగత్ సింగ్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలన్నారు. ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో పొందుపరిచాలని కోరారు. నేటి యువతరం భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, హెచ్ఎం గోదా దేవి, టీచర్స్ శిరీష, కవిత, సరస్వతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శనివారం 23, మార్చి 2024
www.warangalvoice.net

# టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి

## డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి భాయ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐడీఓసీలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి భాయ్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థలతో పాటు మిగిలిన అన్ని శాఖల సహకారంతో టీబీ రహిత సమాజం కోసం పాటుపడాలని పేర్కొన్నారు. గ్రామాలలో నిర్వహించే వీహెచ్ఎన్ డీ రోజున క్షయ వ్యాధి, లక్షణాలు, నివారణ, పూర్తి చికిత్సపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఆర్ బీఎస్ కే టీములు పాఠశాలలను సందర్శించినప్పుడు విద్యార్థులలో కూడా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని, ప్రతి మంగళవారం, గురువారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాలలో మహిళలకు ఊపిరితిత్తుల ద్వారా వచ్చే క్షయ వ్యాధి కాకుండా శరీరంలోని ఏ భాగానికైనా క్షయ వ్యాధి సోకవచ్చుననే విషయాన్ని అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. ముందుగా క్షయ నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మురళీధర్ జిల్లాలో ఎనిమిది మైక్రోస్కోపిక్ సెంటర్లు, ఐదు టీబీ యూనిట్లు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సీబీ నాట్ ద్వారా క్షయ వ్యాధి నియంత్రణకు పాటుపడుతున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది గృహ సందర్శన చేసినప్పుడు క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి తెమడ పరీక్ష చేయించి, 100 శాతం నూతన కేసులను గుర్తించి పూర్తిస్థాయి చికిత్సను అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష, ప్రోగ్రాం అదికారులు డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రవీందర్ రావు, సీహెచ్ఓ కృష్ణార్జున రావు, పీహెచ్ఎన్ కావేటి మంగమ్మ, ఎన్సీడీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్ రెడ్డి, పురుషోత్తం, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, టీబీ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ శ్వేత, అశోక్, ఎన్హెచ్ఎం డీపీఓ రుక్మొద్దీన్, డీడీఎం సౌమిత్, రాజకుమార్, అరుణ్, మనోహర్, శ్రీనివాస్, టీబీ సూపర్ వైజర్స్, టీబీహెచ్వీలు, ల్యాబ్ టెక్నిషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను కలిసిన నీలం శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నీలం శ్రీనివాస్ బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నీలం శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీసీలకు లోన్స్ ఇవ్వవలసిందిగా ఆయన్ని కోరినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రానికి చెందిన పత్తిపాక శ్రీధర్ (40) అనే ఫొటోగ్రాఫర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వృత్తిలో భాగంగా శు క్రవారం ఉదయం హనుమకొండలోని వివాహ వేడుకకు వెళ్లి ప్రోగ్రాం కవర్ చేసి మధ్యాహ్నం సమయంలో ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. బావుపేట క్రాస్ వద్ద ఆగి క్రాస్ అవుతున్ననేపథ్యంలో వెనుక వైపు నుంచి అతివేగంగా కారులో వచ్చిన ఎస్సార్ కాలేజ్ స్టూడెంట్స్ ఢీకొట్టడంతో బైక్ పై నుంచి ఎగిరిపడ్డ ఫొటోగ్రాఫర్ శ్రీధర్ తలకు, శరీర భాగాలకు తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే స్పృహ కోల్పోయాడు. వెంటనే అక్కడున్న స్థానికులు 108 అంబులెన్స్ లో వరంగల్ ఎంజీఎంకు తరలించి ప్రథమకు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని గార్డెన్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. అప్పటికే బ్రెయిన్ డెడ్ అయిన శ్రీధర్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఎస్ఆర్ కాలేజ్ స్టూడెంట్ ఇషాంత్ యువతులతో కారులో మాట్లాడుకుంటూ అతివేగంతో నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదం చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నిరుపేద కుటుంబమైన శ్రీధర్ మరణంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోగా, సంఘటన స్థానికులను కలిచి వేసింది. ఫొటోగ్రాఫర్ శ్రీధర్ కుటుంబానికి నియోజకవర్గ సీనియర్ నాయకుడు స్వర్గం రవి రూ.5000 ఆర్థిక సాయంగా అందజేశారు.

## మంత్రి తుమ్మలను కలిసిన రాష్ట్ర నాయకులు నరేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** రాష్ట మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నూకల నరేశ్ రెడ్డి శనివారం ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి సమక్షంలో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో నరేష్ రెడ్డి చేరారు. తన చిరకాల మిత్రుడైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డోర్నకల్ నియోజకవర్గంలోని రాజకీయ సమీకరణాలపై చర్చించారు. ఇంకా ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, గద్దర్ ఆలోచన వేదిక నాయకులు సుద్దాల నాగరాజు, నలిగంటి విజయపాల్, ఐత ప్రవీణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైదం సంజీవ రాజేందర్ హరిబాబు పాణి కృష్ణ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ప్రేమలత

**వరంగల్ వాయిస్ , ములుగు :** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మైనార్టీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపీఎస్సీ సీఎస్ఏటీ -2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ప్రేమలత శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్లు నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33% సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని అన్నారు. యూపీఎస్సీ సీఎస్ఏటీ %--%2025 సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థుల ద్వారా నెల 15 నుంచి ఆన్ లైన్ %ఉషఉష్.ఎతీవఱరవశ్రీఖఅస్త్రుఖఉ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయన్నారు. దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ ఏప్రిల్ 12 కాగా, ప్రవేశ పరీక్ష తేదీ ఏప్రిల్ 28న అన్ని జిల్లా కేంద్రాలలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించబడునని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5 లక్షల కన్నా తక్కువగా ఉండాలని, అర్హులైన ఆసక్తి కలిగిన మైనార్టీ విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలి

### పీఆర్టీయూ నడికూడ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కాకుండా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని పీఆర్టీయూ నడికూడ మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడం శుభ సూచకమని, ఈ డీఎస్సీ పరీక్షకు ముందే టెట్ నిర్వహించాలని నిర్ణయించి షెడ్యూల్ ను ప్రకటించింది. ఈ టెట్ నిర్వహణపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి ఉన్నదన్నారు. 2010 తర్వాత ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఖచ్చితంగా టెట్ పాసై ఉండాలని నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. టెట్ సర్టిఫికెట్ ఉంటేనే వారికి పదోన్నతులు కల్పించనున్నారని రాష్ట్రంలో చాలామంది ఉపాధ్యాయులకు టెట్ సర్టిఫికెట్ లేదని, దాంతో వారికి పదోన్నతులు నిలిపివేశారని ఇలాంటి ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణులు పొందిన ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ తీసుకొచ్చినటువంటి ఈ టెట్ నిబంధనలను ఉపాధ్యాయుల కోసం నిబంధనలు సడలించేలా లేదా ప్రత్యేకంగా టెట్ నిర్వహించే విధంగా, లేదా 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అచ్చ సుదర్శన్ అన్నారు.

## తిరుపతమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 32వ డివిజన్‌లోని కోయవాడలో తిరుపతమ్మ దేవస్థానంలో శనివారం అమ్మవారి కళ్యాణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 32 వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మా రవి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

## కివి హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అండర్ రైల్వే గేట్ కరీమాబాద్ ప్రాంతంలో గల కివి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా జరిగింది. ఆరోగ్యమే మహాభాగ్యం నానుడికి విద్యార్థులు సుమారుగా 200 వివిధ రకాల ఆహార పదార్థాలను స్వయంగా ఇంటి దగ్గరే పేరెంట్స్ ( సహకారంతో తయారు చేసుకుని వచ్చారు. నేడు బయట ఎన్నో కల్తీ ఆహారాలు, జంక్ ఫుడ్ తినడం వల్ల విద్యార్థినీ విద్యార్థులు,వారి కుటుంబ సభ్యులు ఎన్నో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అలా కాకుండా ఇంటి వద్దనే తయారు చేసినటువంటి చక్కటి పోషక ఆహారం, వివిధ సాంప్రదాయపరమైనటువంటి వంటలను భుజించడం వల్ల మనిషి ఆరోగ్యంతో పాటు ఎంతో ఉల్లాసంగా ఉంటారని ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి అన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. చిన్ననాటి నుంచి విద్యార్థులు మార్కెటింగ్ స్ట్రాటజీని నేర్చుకుంటూ తాము ఇంటి వద్ద నుంచి తెచ్చినటువంటి ఈ ఆహార పదార్థాలను ఒక విలువ జోడించి వారు క్రయ విక్రయాలు కూడా చేయడం వల్ల వారి లోపల మార్కెటింగ్ నైపుణ్యం అనేది పెంపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి, డైరెక్టర్ దాసి రజిని, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, అధ్యాపక బృందం రవితేజ, రంజిత, జోత్స్న, స్రవంతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడండి

## ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత స్వతంత్ర సంగ్రామ పోరాట యువకిశోరాలు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 93వ , సంస్మరణ కార్యక్రమం శనివారం ఖిలా వరంగల్ లోని పడమరకోట చమన్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద ఏఐకేఎంఎస్ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి మానవ హక్కుల వేదిక నాయకులు బండి కోటేశ్వరరావు పూలమాల వేశారు. అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నదని పార్లమెంటు ఎన్నికల సమయంలో పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకున్నదని దీనివల్ల దేశంలోని ముఖ్యంగా ముస్లిం ప్రజానీకంపై దాడులు జరిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ముస్లింలు దళితులు ఆదివాసీలు ఇతర వర్గాల ప్రజలపై హింసకాండ కొనసాగిస్తున్నదని ఆయన అన్నారు. పార్లమెంటరీ ప్రభుత్వం ద్వారా దేశవ్యాప్తంగా ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ రాజ్యాంగపర, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నదని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను నాయకులను టార్గెట్ చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ అక్రమ కేసులు బనాయించి జైల్లోకి పంపుతున్నదని ఆయన విమర్శించారు. 13 నెలల రైతాంగ ఉద్యమానికి తలొగ్గి నట్లు నటించి ఇచ్చిన హామీలను తుంగలో , తొక్కిందని ఆయన అన్నారు దేశ కార్మిక వర్గ హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని దీని మూలంగా సామ్రాజ్యవాదులకు దేశ బడా కార్పొరేట్ దోపిడీదారులకు దేశ సంపద దోచుకోవడంతో పాటు కార్మికుల శ్రమ దోపిడీ చేసేందుకు గేట్లు బార్లా తెరిచినట్టైందని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీ బీజేపీ దాని మిత్రపక్షాల కూటమిని ఓడించాలని ఆయన ప్రజలను కోరారు.

# యువ నేతాజీ ఫౌండేషన్ రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 93 వ అమరవీరుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో శనివారం తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి అతిథులుగా రెడ్ క్రాస్ పాలకవర్గం విచ్చేసి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు 93వ అమరవీరుల దినోత్సవం సందర్బంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినందుకు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు)ను శాలువా, మెమొంటో తో పాలకవర్గం సత్కరించారు. గుల్లెపెల్లి శివ కుమార్ ఆర్గనైజర్లను, రక్తదాతలను రెడ్ క్రాస్ పాలకవర్గం పక్షాన అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, యువ నేతాజీ ఫౌండేషన్ తరపున గుల్లెపెల్లి శివ కుమార్, బొట్టు కమలాకర్ , గజ్జెల సుమన్, అలువాల పృథ్వీ, ఉప్పరపెల్లి రాజ్ కుమార్, మునిగల రాము, ఎస్.కె ముస్తఫా, ఊరటి రవి కుమార్, కోలా రాజేష్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ), చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము , సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్, నరేష్, జాన్సన్, అశోక్, శ్రావణ్, దయాకర్, మహేందర్, కుమార్, శ్రీకాంత్, సంతోష్, జగదీశ్, రామ్, అనిల్, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది ఆనంద్, కరుణ శ్రీ, పవన్, రాజు, పోశాలు, రక్తదాతలు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్నిసేకరించారు.

# జాతీయోద్యమ వీరుల స్ఫూర్తితో పోరాడుదాం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయోద్యమ వీరులైన షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత పోరాడి, కుల మతోన్మాద విచ్చు కత్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ విశ్వవిద్యాలయంలో షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ నాడు భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరిట దోచుకుంటే, నేడు భారత పాలకులైన బీజేపీ ప్రభుత్వ సహకారంతో అదాని, అంబానీ, టాటా, బిర్లా లాంటి అనేక బహుళ జాతి కంపెనీలు దేశ ఆర్థిక వ్యవస్థను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల మోడీ పాలనలో భారత రాజ్యాంగ లక్ష్యాలు, పౌరుల ప్రజాస్వామిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థలు, దేశ లౌకిక వ్యవస్థ పెను ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వంలా కలిసిమెలిసి జీవిస్తున్న దేశ పౌరుల మధ్య ఎన్ ఆర్ సీ, ఎన్ పీపీ లాంటి చట్టాలను తీసుకువచ్చి దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. భావి భారత పౌరులైన విద్యార్థుల మెదళ్లలో కుల, మత విష బీజాలు




నాటేందుకు, విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించేందుకు నూతన జాతీయ విద్యా విధానం 2020ని తీసుకువచ్చారని తెలిపారు. దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో, విశ్వవిద్యాలయాల్లో నాణ్యత ప్రమాణాలు పెంపొందించి, పరిశోధనలకు కావలసిన మౌలిక వసతులు కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్వేచ్ఛ, సమానత్వ సమాజ స్థాపన కోసం ప్రాణ త్యాగాలకు వెనుకాడకుండా ఉరికొయ్యలను ముద్దాడిన జాతీయోద్యమ వీరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్, రమేష్, కుమార్ రాథోడ్ , ప్రశాంత్, కళ్యాణ్, మంగీలాల్, మౌనిక, శిరీష, సురేష్ రాథోడ్, కళ్యాణి,సంగీత, అనూష, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# దేశ రైతాంగాన్ని మోసగించిన మోడీని ఓడించాలి

## సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భగత్ సింగ్ రాజ్ గురు సుఖ దేవ్ ల అమరవీరుల దినోత్సవం సందర్భంగా మార్చి 23ను సేవ్ డెమోక్రసీ డేగా జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని శనివారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో ఎస్కేఎం నాయకులు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారున. అనంతరం జరిగిన కార్యక్రమానికి కుసుంబ బాబురావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగ ఉద్యమ విరమణ సమయంలో ఎస్కేఎం జాతీయ నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దేశ రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. అలాగే కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిందని ఆయన విమర్శించారు. ఉద్యమ సమయంలో కనీస మద్దతు ధర హక్కు చట్టం చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని, రుణ విమోచన చట్టం



చేస్తామని రైతు నాయకులకు హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఉద్యమ సమయంలో రైతాంగ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయక పోగా మరో రూపంలో వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు రాబోవు ఎన్నికల్లో ఓడించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కేఎం నాయకులు గోనె కుమారస్వామి, సోమిడి శ్రీనివాస్, సూదమల్ల భాస్కర్, చిర్ర సూరి, ఓదెల రాజయ్య, మైదం పాణి, తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తుల స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భగత్ సింగ్, రాజ్ గురు, సుగుదేవ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఈ దేశానికి స్వతంత్రం రావాలని యువతను ఐక్యపరచి స్వాతంత్ర ఉద్యమంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ఉరి కంభం ఎక్కే వరకు అంకితభావంతో కృషి చేశారన్నారు. ఆ మహనీయులను స్ఫూర్తిని తీసుకొని నేటి విద్యార్థులు యువకులు సామాజిక దృష్టితో రాజకీయాల్లోకి రావాలని అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం అనేక రంగాలను జాతీయం చేస్తే నేడు బ్యాంకులు, ఎల్ఐసీ, రవాణా, రక్షణ రంగం, విమాన, రైల్వే, పరిశ్రమలు తదితర రంగాలను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నదన్నారు. కార్పొరేట్ రంగాలకు కొమ్ముకాస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలిస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని మరిచి, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనా కూడా కేంద్రం విడచెవిన పెట్టిందన్నారు. భారత రాజ్యాంగం, లౌకిక వ్యవస్థ, ప్రజాస్వామ్య వ్యవస్థపై దేశవ్యాప్తంగా దళితులపై. ముస్లిం మైనార్టీలపై, ఆదివాసులపై దాడులు జరుగుతున్నా అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కర్రె భిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, భాషబోయిన సంతోష్, ఏశబోయిన శ్రీనివాస్, ఊట్కూరి ప్రణీత్ గౌడ్, కొట్టే వెంకటేష్, రవితేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** భగత్ సింగ్ ఆశయాలను నేటి విద్యార్థులు,యువత సాధించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరు ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్ అన్నారు. శనివారం భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా వర్ధంతిని పురస్కరించుకొని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరు ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్ లు మాట్లాడుతూ విద్యార్థులకు నష్టం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే బేషరుతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులను ఏకం చేసి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసేంత వరకు పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ దేశంలో కుల, మత,పేద, ధనిక తారతమ్యాలు లేకుండా బ్రతకాలంటే సోషలిజమే మార్గమని చెప్పారన్నారు. ఆయన ఆశయ స్ఫూర్తిని ఏఐఎస్ఎఫ్ ముందుకు తీసుకెళ్తూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, జిల్లా నాయకులు సిపతి వినయ్ పాల్గొన్నారు.

# మోడీ అప్రజాస్వామిక విధానాలు ఖండించండి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నరేంద్ర మోడీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఖండిస్తూ వరంగల్ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముక్కెర రామస్వామి అధ్యక్షతన కరీమాబాద్ ఎస్ బీఐ బ్యాంకు వద్ద మోడీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రతిపక్షాలన్ని ఈడీల పేర్లతోనే భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతూ మళ్లీ ఎన్నికలలో గెలవాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఏకపక్షంగా ఈ ఎన్నికలలో 400 సీట్లు గెలుస్తామని అబద్ధాల ప్రచారం చేసుకుంటూ ప్రతిపక్షాలపై దాడిని తీవ్రతరం చేస్తుందన్నారు. ఇప్పటికే దేశంలో నిత్యవసరాల సరుకుల ధరలు ఆకాశాన్ని ఆకాశాన్నంటాయని, ప్రజలు కార్మిక వర్గం కొనే స్థితిలో లేరన్నారు. బీజేపీ విధానాల వల్ల భారతదేశంలో ఉన్న ప్రజలందరూ కడు పేదరికంలో మగ్గుతున్నారని, దేశంలో అభివృద్ధి ఎక్కడ కనబడడం లేదన్నారు. పెట్టుబడుదారులకు, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను దారదత్తం చేస్తూ, కార్మిక హక్కులను కాలరాస్తూ దేశాన్ని అప్పులపాలు చేసిందన్నారు. ప్రజానీకం మరోసారి బీజేపీ ప్రభుత్వానికి గెలిపిస్తే భారతదేశం సర్వనాశనమై ఉద్యోగాలు, విద్యా, వైద్యానికి దూరం అవుతుందన్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికలలో బీజేపీని ఓడించి సెక్యులర్ వామపక్ష పార్టీలను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, సింగార బాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సాగర్, అరుణ్ కుమారు, దుర్గయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏరా ప్రశాంత్, దివ్య, పెంటయ్య, జుబేదా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీయాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీయాలని మరిపెడ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ కవిత అన్నారు. ఈ నెల 22న వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అర్థశాస్త్రం విభాగంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కవిత అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో కూడా ప్రతిభ పాటవాలు ఉంటాయని, ఈ క్విజ్ పోటీలలో పాల్గొనటం వల్ల తెలిసిందన్నారు. అలాగే భవిష్యత్తులో మన కళాశాల విద్యార్థులు మరిన్ని పోటీలలో పాల్గొని మన కళాశాలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అలాగే ఈ క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు గ్రీష్మిక, మైనా ప్రత్యూష, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్ ను ప్రత్యేకంగా ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ ఏజే రామారావు, అధ్యాపక బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నిక ప్రచార వ్యయానికి రేటు చార్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన రేటు చార్ట్ పై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి సమావేశం శనివారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో నిర్వహించే సభలు, వేదిక, ప్రచారానికి వినియోగించే స్పీకర్లు, చైర్లు, టెంట్ సామగ్రి, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్స్, కటౌట్స్, ఫ్లెక్సీలు, వీడియో కవరేజ్, వాహనాలు, తదితర ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సామగ్రి ధరల పట్టికను హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి వారి అభిప్రాయాలను, అభ్యంతరాలను స్వీకరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వెల్లడించిన అంశాలను వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ కు రిపోర్టును అందజేయనున్నట్లు అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నేహాల్, రజినీకాంత్, మణి, శ్యామ్, లక్ష్మణ్, జైపాల్ రెడ్డి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, వేలేరు :** విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని అవి సాధించే దిశగా కృషిచేయాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, డాక్టర్ ప్రహసిత్ ఉద్భోదించారు. పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలో నిర్వహించే కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో భాగంగా వేలేరు గురుకుల పాఠశాల , కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రహసిత్ పాల్గొని ప్రసంగించారు. వివిధ పోటీపరీక్షలలో రాణించాలంటే పాఠ్యాంశ జ్ఞానంతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలంటే భయం విడనాడాలన్నారు. ఒత్తిడితో కాకుండా ఇష్టంగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు విద్యార్థులు కలలు కనడమే కాదు వాటిని సాకారం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ అజయ్ కుమార్, సీనియర్ టీచర్ కేఎన్ వీ రాజగోపాల్, పాఠశాల కెరీర్ అండ్ గైడెన్స్ ఇంచార్జి ఆర్ శారద తదితరులు పాల్గొన్నారు.

## గోమతిలో ముందస్తుగా హోలీ వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 26 వ డివిజన్ గిర్మాజీపేట్ బొడ్రాయి వద్ద గల గోమతి పబ్లిక్ స్కూల్ లో శనివారం ముందస్తుగా హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ చేతులకు సహజ సిద్ధమైన రంగులు పూసుకుని ఒకరిని ఒకరు రంగులు అద్దుకుని హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కూచన క్రాంతి కుమార్ మాట్లాడుతూ చెడుపై మంచి విజయకేతనం ఎగురవేసిన సందర్భంగా ఈ హోలీ పండుగను జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. హోలిక అనే రాక్షసి తనకు లభించిన వరాలను చెడు పనులకు, అధర్మానికి ఉపయోగిస్తుంటే ఆ వరం నిరుపయోగమైన విధానం, అధర్మంపై ధర్మమే విజయాన్ని సాధిస్తుందనే దానికి ఈ పండుగ నిదర్శనమని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కూచన హారతి, ఇంచార్జి ఈ.కరుణ, ఉపాధ్యాయులు సంధ్య, శ్రుతి, విద్యాధరి, సంయుక్త, ప్రగతి, ఫరీదా, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలిండియా బాడ్మింటన్ పోటీల్లో ఏసీపీ జితేందర్ రెడ్డికి పతకం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 17 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని పుల్లెల గోపిచంద్ అకాడమీలో నిర్వహించిన 16వ ఆలిండియా పోలీస్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో ఏసీపీ ఎం. జితేందర్ రెడ్డి కాంస్య పతకాన్నిసాధించాడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న జితేందర్ రెడ్డి ఈ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం తరుపున పాల్గొని 55 సంవత్సరాల విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలో అడిషనల్ ఎస్పీ వెంకట్రావ్‌తో కలిసి అడి కాంస్య పతకాన్ని సాధించాడు. ఏసీపీ జితేందర్ గతంలోను జాతీయ స్థాయిలో నిర్వహించిన పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు పలు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలను సాధించాడు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఏసీపీ జితేందర్‌ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఏసీపీ జితేందర్ రెడ్డి పోలీస్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు.

## తాగునీటి కొరతను నివారించాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలో తాగునీటి కొరత ఏర్పడుతుందని అధికారులు స్పందించి వెంటనే తాగునీటి కొరతను నివారించాలని సీపీఐ (ఎం) మండల కార్యదర్శి దుండి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మరిపెడ మండలంలో 44 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో 15వార్డులు ఉన్నాయని తెలిపారు. 125 హెబిటేషన్ పరిధిలో 133 ఓహెచ్ఎస్ఆర్ ఉన్నట్లు తెలిపారు. ఈ పరిధిలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నుంచి తాగునీరు సక్రమంగా అందడం లేదని, పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాక గిరిజన తండాలలో తాగునీటి కొరత ఏర్పడి వ్యవసాయ బావులు నుంచి తెచ్చుకుందామన్న బావులు అడుగంటి పోతున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఆకేరు, మున్నేరు, పాలేరు వాగులు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు జలాశయాలు అందుబాటులో లేకుండా పోయినట్లు తెలిపారు. తాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.




# శ్రీరామనవమికి.. ప్రకటన

యానిమల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ రామాయణం. భారతీయ ఇతిహాసం ఆధారంగా రానున్న ఈ సినిమాకు దంగల్ ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, శాండల్‌వుడ్ స్టార్ యష్ రావణుడిగా నటించనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్ సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం ఏప్రిల్ 17న శ్రీరామ నవమి రోజున ఈ సినిమాను అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. వచ్చే నెలలో ముంబైలో షూటింగ్ ప్రారంభమవుతుందని.. అలాగే ఈ ప్రాజెక్ట్ యొక్క మొదటి భాగాన్ని 2025 దీపావళికి విడుదల చేయడానికి ప్లాన్ చేయనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

# మళ్లీ సినిమాలతో బిజీగా సాయిపల్లవి

సాయిపల్లవి నిజంగా టిపికల్ సౌతిండియన్. తను అందరిలాంటి ఆడపిల్ల కాదు. ఆమెలోని ఆత్మవిశ్వాసం.. ఆత్మగౌరవం.. నిజాయితీ.. ఆమె అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. సాటి తారలతో నిలబడితే ధృవతారగా మెరిసిపోతుంటుంది తను. అందుకే ఆమెకు అంతమంది అభిమానులు. 'గార్గి' తర్వాత సినిమాలకు విరామం ఇచ్చి, దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగొచ్చిన ఈ బంగారుబొమ్మ.. ఇప్పుడిప్పుడే నిదానంగా మళ్లీ సినిమాలకు సైన్ చేస్తున్నది. తెలుగులో నాగచైతన్య 'తండేల్', తమిళంలో శివకార్తికేయన్ సినిమా ఇప్పటికే ఓకే చేసింది. అమిర్‌ఖాన్ కొడుకు హీరోగా రూపొందుతోన్న సినిమా ద్వారా బాలీవుడ్‌లో అరంగేట్రం చేయనున్నది. ఇక నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న 'రామాయణం'లో సీతగా నటిస్తున్న విషయం తెలిసిందే. మొత్తంగా మళ్లీ సాయిపల్లవి బిజీబిజీ అయిపోయింది. ఇక అసలు విషయానికొస్తే.. నటిగా ఇప్పటికే అన్ని వర్గాల ప్రేక్షకులనూ మెప్పించిన సాయిపల్లవి, త్వరలో మెగా ఫోన్ పట్టనుందట. ఈ విషయాన్ని స్వయంగా ఆమే తెలిపింది. 'నాకు డైరెక్షన్ చేయాలనే ఆలోచన ఉంది. దానికోసం నా అభిరుచికీ, ఆలోచనకూ తగ్గట్టు ఓ కథ కూడా రాసుకుంటున్నాను. ప్రస్తుతం అది ఆలోచన మాత్రమే. మరి నా కథకు నిర్మాతలెవరో నాకే తెలియదు. నాకు తెలిశాక మీకు చెబుతా' అంటూ నవ్వేసింది సాయిపల్లవి శంతామరై.






# రాధాకృష్ణ దర్శకత్వంలో ..

టాలీవుడ్ నటుడు గోపీచంద్ మరో సాహసం చేయబోతున్నాడు. ప్రభాస్‌కు 'రాధేశ్యామ్' వంటి భారీ డిజాస్టార్ సినిమాను ఇచ్చిన రాధాకృష్ణతో తన తర్వాతి సినిమా చేయనున్నాడు. రాధాకృష్ణ దర్శకుడిగా పరిచయం అయ్యింది గోపీచంద్ సినిమాతో అన్న విషయం తెలిసిందే. రాధాకృష్ణ దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా వచ్చిన చిత్రం జిల్. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం 2015లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఈ సినిమా ఇచ్చిన విజయంతో ప్రభాస్‌తో రాధేశ్యామ్ సినిమా చేశాడు రాధాకృష్ణ. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద అట్టర్ ప్లాప్‌గా నిలిచింది. అయితే చాలారోజుల తర్వాత రాధాకృష్ణ ఓ సినిమా చేయబోతుండగా.. ఈ మూవీలో గోపీచంద్ హీరోగా నటించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ మూవీ స్టోరీ లైన్‌ను గోపీచంద్‌కు వినిపించగా అతడు ఓకే చేసినట్లు టాక్. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను కూడా యూవీ క్రియేషన్స్ నిర్మించనుంది.




# ఫ్యామిలీ స్టార్ మూవీ ప్రమోషన్స్ షురూ




రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. గీతగోవిందం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. ఎస్‌వీసీ బ్యానర్‌లో వస్తున్న 54వ చిత్రమిది. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ షూరు చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే ఈ మూవీలో మృణాళ్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే మృణాళ్ కాకుండా మరో కొత్త కథనాయిక ఈ సినిమాలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అమెరికన్ నటి 'మరిస్సా రోజ్ గార్డన్' ముఖ్య పాత్రలో నటించనున్నట్లు తెలుస్తుంది. అలాగే మజిలీ మూవీ హీరోయిన్ 'దివ్యాంశ కౌశిక్' ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ది గ్రేవ్, బ్లడ్ అండ్ బోన్, బ్లాక్ హార్ట్, వైల్డ్ సిటీ లాంటి చిత్రాలు మరిస్సాకి మంచి పేరు తెచ్చాయి. మైండ్ ఓవర్ మర్డర్ అనే టీవీ సిరీస్ కూడా ఆమెకి మంచి గుర్తింపు తీసుకోచ్చింది. కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ ఈ సినిమాలో కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్.



# కోటను సందర్శించిన వియత్నాం దేశస్థులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఖిలావరంగల్ కోటను మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రం, హైదరాబాద్ లో శిక్షణ పొందుతున్న వివిధ ప్రభుత్వ సంస్థల మీడియాలో పనిచేస్తున్న 26 మంది వియత్నాం దేశస్థులు శనివారం సందర్శించారు. కాకతీయ రాజులు పరిపాలించిన కాలం నాటి ఖిలావరంగల్ మధ్య కోటలోని శిల్పాలను స్టడీ టూర్ లో భాగంగా తిలకించారు. వారికి స్థానిక గైడ్ కిరణ్ ప్రకాష్ కాకతీయుల కాలం నాటి చరిత్ర, విశేషాలను వివరించారు. ఖిలావరంగల్ కోటలోని కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణతో పాటు గుండుచెరువు, ఖుష్ మహల్, సింగారపు బావి, రాతి, మట్టికోట తదితర కట్టడాలను ఆసక్తిగా తిలకించారు. అద్భుతమైన కళాఖండాలు, శిల్పసంపదలు, కోట దృశ్యాలను తమ వెంట తెచ్చుకున్న కెమెరాలలో బంధించారు. వీరి వెంట హైదరాబాద్ డాక్టర్ ఎంసీబీహెచ్ ఆర్ డీ ఫాకల్టీ డాక్టర్ కె.సురేష్ కుమార్, శ్రీనివాస్, డీపీఆర్ ఓ ఆయుబ్ అలీ, వరంగల్ ప్రాంతీయ శిక్షణ కేంద్ర మెనేజర్ కుమార స్వామి, సీఐ మల్లయ్య, ఎస్ ఐ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు వేయి స్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయాలను సందర్శించారు.

# 2025 నాటికి క్షయ రహిత జిల్లాగా వరంగల్

## డీఎంహెచ్ఓ వెంకటరమణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** 2025 సంవత్సరం నాటికి వరంగల్ జిల్లాను టీబీ ( క్షయ ) రహిత జిల్లాగా మార్చడానికి సమష్టిగా కృషి చేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో శనివారం ప్రపంచ టీబీ రహిత దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలను త్వరితగతిన గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు క్షయపై అవగాహన కల్పించాలన్నారు. 100 శాతం కేసులు గుర్తించి చికిత్సను అంద చేసి ఆన్ లైన్ పోర్టల్ నందు నమోదు చేసి ప్రతి క్షయ రోగికి రూ.500 పారితోషికం అందే విధముగా పాటు పడుతూ రాష్ట్రంలో వరంగల్ జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచడానికి తీవ్రమైన కృషి చేయాలని ఆదేశించారు. అడిషనల్ డీఎంహెచ్ ఓ డాక్టర్ సుందర్ సింగ్ వార్షిక నివేధికను సమర్పించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ సుధర్ సింగ్, డిప్యూటీ డిఎంహెచ్ ఓలు డాక్టర్ గోపాలరావు, డాక్టర్ ప్రకాష్ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# సింహవాహనంపై ఊరేగిన నారసింహుడు

## వైభవంగా కొనసాగుతున్న కోటంచ బ్రహ్మోత్సవాలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో కొలువైన సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు సింహ వాహనాలపై ఆశీనులై భక్తులను కనువిందు చేశారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి సింహ వాహనంపై అధిరోహింపజేసి ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాస్చార్యులు పేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామ పూరవీధుల్లో నరసింహస్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం నిత్య విధి పూజలు, హెూమము, బలిహారణము సేవ తదుపరి ఆరగింపు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా పాల్గొన్నారు. రాత్రి గరుడోత్సవం సదస్యము వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో బిల్లా శ్రీనివాస్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ముల్కనూరి బిక్షపతి, కమిటీ సభ్యులు మల్లేబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి కోటేశ్వరరావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పొలుసాని శ్రీనివాసరావు, లింగంపెల్లి తిరుపతిరావు, గ్రామ పెద్దలు కనుకుంట్ల దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ కొమరాజు రవి, ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, సున్నోయిలా సుధాకర్,నాగుల సుదర్శన్, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కవిత కస్టడీ పొడిగింపు



లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆమె కస్టడీని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో కవిత ఈడీ కస్టడీలోనే మరో మూడు రోజులు ఉండనున్నారు. అయితే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కవితను ముఖాముఖి విచారించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

– వరంగల్ వాయిస్, హైదరాబాద్

# ఏఐసీసీ ముఖ్యలను కలిసిన పెరుమాండ్ల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తనకు వరంగల్ లోక్ సభ టికెట్ కేటాయించాలని కోరుతూ శనివారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎంపీ ఆస్పరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పలువురిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేష్ లిలోథియా, ఏఐసీసీ సెక్రటరీలు రోహిత్ చౌదరి, డాక్టర్ శైలజానాథ్ మయప్పన్, ఏఐసీసీ నేషనల్ ఓబీసీ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ ను ఆయన కలిశారు. అందరూ సానుకూలంగ స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవరెడ్డి, యశస్విని, ఇందిరపై పూర్తి నమ్మకం వుందన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు రేవంత్ రెడ్డి తగు న్యాయం చేస్తున్నారన్నారు. నాకు కూడా తప్పకుండా టికెట్ ఇచ్చి పార్టీకి ఇంకా ఎక్కవ పని చేసే అవకాశం కల్పిస్తారని ఆశించారు. ఈ కార్యక్రమంలో వల్లాల జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## ప్రొఫెసర్ కోదండరాంకు వినతి

## రత్న హెూటల్లో ఇఫ్తార్ విందుకు హాజరు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖాన్న (ఏఐటీసీ అనుబంధం) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పోచమ్మమైదాన్ లోని రత్న హెూటల్ లో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు వచ్చిన కోదండరాంను ఎన్ హెచ్ ఎం ఉద్యోగ సంఘాల నేతలు కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ నెంబర్ 510తో కొంతమందికి అన్యాయం జరిగిందని కోదండరాం దృష్టికి తీసుకొచ్చారు. ఈ జీవో ద్వారా అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. నష్టపోయిన నాలుగు వేల కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. జీవోలో అన్యాయం జరిగిన వారందరికీ రెగ్యులర్ ఉద్యోగుల వేతనంతో పాటు, క్యాడర్ చేసి, 2018 నుంచి అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంపత్ కుమార్, సందీప్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

### బస్తీ దవాఖన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

బస్తి దవాఖన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం కృషి చేయాలని బస్తీ దవాఖన ఉద్యోగులు అమ్జాద్ అలీఖాన్, మెతుకు ఉప్పలయ్య కలిసి బస్తీ దవాఖాన ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com